క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖాధికారి సోమేశ్వరరావు

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక వీటీ అగ్రహారం వద్దనున్న డీ మార్ట్ షాపింగ్ మాల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ప్రమాదాలను ఏ విధంగా నివారించాలో.. అక్కడ ఉండే అగ్నిమాపక పరికరాలను ఏ విధంగా ఉపయోగించాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, డీమార్ట్ షాపింగ్ మాల్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

భోగాపురం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి గోవిందరావు అన్నారు. పోలిపల్లి పీహెచ్‌సీ పరిధిలోని రాజాపులోవలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే మలేరియా, డెంగీ వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీహెచ్ఈఓ రమణమూర్తి, సూపర్‌వైజర్ లక్ష్మణ్, ఏఎన్ఎం దమయంతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



సమావేశమైన చిన్నారుల తల్లులు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య అందిస్తున్నట్లు సూపర్‌వైజర్ జి. ఎర్రయ్యమ్మ అన్నారు. జన్ భాగీదరీ కార్యక్రమంలో భాగంగా స్టేడియంపేట మాదిగవీధి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల్లో సృజనాత్మకత వెలికితీయడానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. సమావేశంలో మహిళా పోలీస్ లక్ష్మి, కల్యాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు భవానీ, నజీమా, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపకుండా భూసేకరణ వద్దు



కలెక్టరేట్ ఎదుట రైతుల నిరసన

విజయనగరం అర్బన్:

జిల్లా మీదుగా విశాఖ – అరకు జాతీయ రహదారి –516 బీ (బైపాస్ రోడ్డు) కోసం ప్రత్యామ్నాయం చూపకుండా రైతుల నుంచి భూసేకరణ చేయవద్దని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు కొత్తవలస, ఎల్.కోట, ఎస్.కోట మండలాలకు చెందిన రైతులు సోమవారం స్థానిక జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం బలవంతంగా రైతుల భూమిని లాక్కోవడం.. 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలోకి తొక్కడమేనని ఆరోపించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి డేగల అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం, పోరాట కమిటీ నాయకులు రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పరీక్షించి.. మందులిస్తున్నారు...

- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దనే వైద్యం
- నెలలో రెండుసార్లు తనిఖీలు
- మందులు కూడా ఉచితమే
- ఆనందం వ్యక్తం చేస్తున్న రోగులు

విజయనగరం రూరల్:


ప్రజలకు మెరుగైన వైద్య సేవలే అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గతేడాది నవంబర్‌లో తీసుకువచ్చిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దనే నెలకు రెండు దఫాలుగా వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే 24 గంటలు గ్రామాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామాల్లో సాధారణ రోగులతో పాటు దీర్ఘకాలిక రోగులకు వైద్య సేవలు అందడంతో వారంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.

విజయనగరం మండలంలోని రాకోడు పీహెచ్‌సీ పరిధిలో 13 గ్రామ సచివాలయాలు ఉండగా, వీటిలో ఒకటి రాకోడులో ఉండగా.. మిగిలిన 12 సచివాలయాల పరిధిలో 12 వెల్‌నెస్ కేంద్రాలు ఉన్నాయి. ప్రతీ వెల్‌నెస్ కేంద్రం పరిధిలో ఇద్దరు ఏఎన్ఎంలు అందుబాటులో ఉన్నారు. రాకోడు పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో మంచానికి పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు, వికలాంగులు, వృద్ధులు, చిన్నారులు, ఆరోగ్యశ్రీ రోగులను నేరుగా కలుసుకుని వైద్యసేవలు అందిస్తున్నారు. అలాగే గ్రామాల్లోని అంగన్‌వాడీ, పాఠశాలల విద్యార్థులను కూడా పరీక్షిస్తున్నారు. గ్రామాల్లోని రోగులకు 14 రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంతో తమకు ఖర్చులతో పాటు ఇబ్బందులు తప్పాయని రోగులు, వారి కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పై చిత్రంలో వైద్య సేవలు అందుకుంటున్న వ్యక్తి పేరు బుద్ధరాజు రవివర్మ (48). ఈయనది నారాయణపురం గ్రామం. కొన్నేళ్లుగా సుగర్, బీపీ వ్యాధులతో బాధపడుతున్నారు. అయితే ఆయన ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో డాక్టర్లు, వైద్య సిబ్బంది నెలకు రెండుసార్లు గ్రామానికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తుండటంతో ఆస్పత్రికి వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పాయని ఆయన చెబుతున్నారు. ప్రభుత్వం ఇంటి వద్దే వైద్యసేవలు అందించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు అందించిన వైద్య సేవలు	
నమోదైన ఓపీ:	11,141
చేపట్టిన వైద్య పరీక్షలు:	8,103
బీపీ పరీక్షలు:	2,621
సుగర్ పరీక్షలు:	1,937
గర్భిణులు:	1,220



నా పేరు తుమ్మగంటి సత్యం. నా వయస్సు 59. మాది మలిచర్ల గ్రామం. కొన్నేళ్లుగా సుగర్ వ్యాధితో బాధపడుతున్నాను. అయితే కొన్ని నెలలుగా డాక్టర్లు గ్రామానికి రెండుసార్లు వచ్చి నన్ను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఇప్పుడు ఆరోగ్యం కుదుటపడింది. గతంలో ఆస్పత్రుల చుట్టూ తిరగలేక చాలా ఇబ్బంది పడేవాడ్ని. ప్రస్తుత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వల్ల మాలాంటి ఎంతోమందికి మేలు జరుగుతోంది. మా ఆరోగ్య సమస్యలు గుర్తించి, ఇంటి వద్దకే వైద్యులను పంపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

నెలలో రెండుసార్లు..

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో నెలలో రెండుసార్లు పర్యటించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. అలాగే అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు అందిస్తున్నాం. మండలంలో 5,749 మంది దీర్ఘకాలిక రోగులను గుర్తించి వైద్య సేవలు ఉచితంగా మందులు అందిస్తున్నాం. వెల్‌నెస్ కేంద్రాల పరిధిలో ఏఎన్ఎంలు 24 గంటలూ అందుబాటులో ఉంటున్నారు.

– మోపాడ జగదీష్, వైద్యాధికారి. రాకోడు పీహెచ్‌సీ, విజయనగరం



మలిచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి వైద్య పరీక్షలు

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ పి.బాలాజీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 8 వార్డు సచివాలయాల పరిధిలో మొత్తం 126 పోస్టులకు గాను 7 ఖాళీగా ఉన్నాయన్నారు. జరజాపుపేటలోని రెండు సచివాలయాల్లో 3, మొయిద జంక్షన్, అగురువీధి, ఇందిరాకాలనీ, గాంధీనగర్ కాలనీల్లోని సచివాలయాల్లో ఒక్కొక్కటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

ఘనంగా జగన్నాథుడి కల్యాణం

విజయనగరం టౌన్: జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక సంతపేట, దాసన్నపేటలో కొలువైన జగన్నాథస్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎల్.సుధారాణి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. స్వామివారికి, అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారి కల్యాణం చేపట్టారు.

అయోనైజ్డ్ నీరు తాగాలి..



అవగాహన కల్పిస్తున్న నేచర్ థెరపిస్ట్ కల్యాణి

నెల్లిమర్ల రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే రోగ నిరోధక శక్తిని పెంచే అయోనైజ్డ్ వాటర్ ఉపయోగించాలని నేచర్ థెరపిస్ట్ కల్యాణి సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో అయోనైజర్ వాటర్ ప్రయోజనాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, ఆల్కలైజేషన్, మైక్రో క్లస్టరింగ్ వంటి మూడు అంశాలు ఉంటే మనిషి ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన



పాఠశాల విద్యార్థులతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఆచార్యులు

విజయనగరం రూరల్: ప్రపంచ సికిల్‌సెల్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కొండకరకాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం సోషల్‌వర్క్ విభాగం, బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఐసీఎంఆర్ ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, సీటీయూఏపీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి మాట్లాడుతూ, ఈ వ్యాధి జన్యు సంబంధమైందని, ప్రాణాంతకమని తెలిపారు. ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో వ్యాపిస్తుందని చెప్పారు. వ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి, గిరిజన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నగేష్, డాక్టర్ దివ్య, డాక్టర్ ప్రేమచటర్జీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణే లక్ష్యం



అభివృద్ధి పనుల శిలాఫలకం ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

- మేయర్ విజయలక్ష్మి

విజయనగరం రూరల్: డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మేయర్ విజయలక్ష్మి అన్నారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 16, 32 డివిజన్లలో రూ. 32 లక్షలతో పార్క్ గేట్, రహదారులు, కాలువలు, కల్వర్టు పనులకు సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కోలగట్లతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఒక పక్క నగరంలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు పేదల ఆకలిని తీర్చే విధంగా ఫుడ్ బ్యాంకులను విరివిరిగా ఏర్పాటు చేసిన ఘనత కోలగట్ల వీరభద్రస్వామికి దక్కుతుందన్నారు. గత పాలకులు నగరాభివృద్ధిని విస్మరిస్తే, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నగరాన్ని అభివృద్ధి చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు ఎం.బాల బ్రహ్మారెడ్డి, రెడ్డి గురుమూర్తి, భోగాపురపు రవిచంద్ర తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డిని, శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామికి గెలిపించేందుకు ప్రజలు ఆశీస్సులు అందించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆయా డివిజన్ల కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



నెల్లిమర్ల: భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

నెల్లిమర్ల: మండల విద్యాశాఖాధికారి –2గా (ఎంఈఓ) ఈపు విజయ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం మండలం జొన్నవలస ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేసిన ఈయన ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌లోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి, గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. జీవీకే కిట్ల పంపిణీపై హెచ్ఎం జనార్దనరావును అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటివరకు నెల్లిమర్ల ఎంఈఓగా పనిచేసిన అంబళ్ల కృష్ణారావు పూసపాటిరేగ మండలం కనిమెల్ల ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా బదిలీపై వెళ్లారు.

ఎంఈఓ –2గా రాధాకృష్ణ

డెంకాడ: మండల విద్యాశాఖాధికారి–2గా సీహెచ్ రాధాకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయం సిబ్బంది రాధాకృష్ణను అభినందించారు.

రథయాత్రకు ఏర్పాట్లు పూర్తి

- నేటి మధ్యాహ్నం మూడు గంటల నుంచి భక్తులకు దర్శనం
- సంతపేట, దాసన్నపేట, మన్నార్ ఆలయం, మూడుకోవెళ్ల వద్ద పూజలు

విజయనగరం టౌన్: జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయినట్లు శ్రీ మన్నార్ రాజగోపాలస్వామి ఆలయ ఈఓ బీఎల్.నగేష్ తెలిపారు. ఈ మేరకు ఆలయం ఆవరణలో ఉన్న రథాన్ని ఉత్సవానికి ముస్తాబుచేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, మంగళవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి రథయాత్ర నిర్వహిస్తామన్నారు. దేవాలయం నుంచి జగన్నాథపురంలోని గుండీచ మందిరం వద్దకు తీసుకువెళ్తామన్నారు. 21 నుంచి 27వ తేదీ వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అదే విధంగా మూడుకోవెళ్లు, సంతపేట, దాసన్నపేటలో ఉన్న ఆలయాల్లో కూడా జగన్నాథునికి విశిష్ట పూజలు నిర్వహించనున్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద రథంలో స్వామివారి భక్తులకు దర్శనమిస్తారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

- డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్
- 33వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్లు

విజయనగరం: అటు రాష్ట్రంలోనూ ఇటు విజయనగరం నియోజకవర్గంలోనూ జనరంజక పాలన సాగుతోందని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 33వ డివిజన్ పరిధి బాలాజీ నగర్ నుంచి సోమవారం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మరో డిప్యూటీ మేయర్ ముచ్చు లయయాదవ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. పలు సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్ ఎం.బాలబ్రహ్మారెడ్డి, గృహసారథి డి. శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ, నగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందన్నారు. సమస్యలు లేని డివిజన్‌లుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, స్థానిక కార్పొరేటర్ జీవీ రంగారావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం



నెల్లిమర్ల: విద్యార్థులను సత్కరిస్తున్న పెద్దలు



నెల్లిమర్ల రూరల్: టాపర్లను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ పద్మలత, ఉపాధ్యాయ సిబ్బంది



డెంకాడ: అక్కివరం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను సన్మానిస్తున్న హెచ్ఎం శ్రీరామ్,ఉపాధ్యాయులు

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను (జగనన్న ఆణిముత్యాలు) ఆయా గ్రామాల పెద్దలు, ఉపాధ్యాయులు సోమవారం సత్కరించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపుపేట ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన సంపర్తి హేమలత, దొంక చేతన్‌కుమార్, కంటిమహంతి చేతనను నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, పాఠశాల హెచ్ఎం నల్లా జగదీశ్వరరావు సన్మానించారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించారు. సతివాడ ఆదర్శ పాఠశాలలో పది, ఇంటర్ టాపర్లను ప్రిన్సిపాల్ పద్మలత ఆధ్వర్యంలో సత్కరించారు. సన్మానగ్రహీతలను మిగతా విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డెంకాడ మండలం అక్కివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జి. వెంకటలక్ష్మి, కంది ఉమ, పతివాడ సుజాతలతో పాటు వారి తల్లిదండ్రులను కూడా హెచ్ఎం వి. శ్రీరామ్, ఉపాధ్యాయులు సన్మానించారు. అలాగే అక్కవరం పంచాయతీ గొల్లపేట మోడల్ స్కూల్‌కు చెందిన జి.తనూజ, ఎం. రాధిక, రఘులను సత్కరించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, పీఎంసీ చైర్మన్ ముద్దాడ రాము, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

– నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్/డెంకాడ



డెంకాడ: ఏపీ మోడల్ స్కూల్‌లో సన్మానం పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పీఎంసీ చైర్మన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు